వైభవంగా ముక్కోటి ఏకాదశి

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారంలో స్వామి వారి దర్శనం

నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 23 : పండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తజనుల జయ జయ ధ్వానాల మధ్య వైకుంఠ(ముక్కోటి) ఏకాదశిని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని సీతారామచంద్రుడు, మహా విష్ణువు, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్తర ద్వారం గుండా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో రాకతో ఆలయ ప్రాంతాలు హరి, గోవింద నామస్మరణలతో మార్మోగాయి. అనంతరం చిన్నజీయర్ స్వామి శిష్యుడు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి తిరుప్పావై ప్రవచనాలు చేశారు. వేడుకల్లో ఆలయ ఈఓ జె.జయరామయ్య, అలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు దంపతులు, కౌన్సిలర్, ఆలయ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ప్రముఖులు పాల్గొన్నారు. అదేవిధంగా పానగల్లు, వాడపల్లిలోని లక్ష్మీనరసింహ, మిర్యాలగూడ, దేవరకొండ ప్రాంతాల్లోని వేంకటేశ్వ స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

త్రిపురారం: వైకుంఠ ద్వారం దర్శనం చేసుకుంటున్న సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డీకవిత దంపతులు

నకిరేకల్ : వేంకటేశ్వర స్వామి ఆలయంలో విష్ణుభగవానుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ కందాల శోభారాణిశ్రీనివాస్‌రెడ్డి

చిట్యాల : నేరడలో స్వామివారికి హారతి ఇస్తున్న మహిళలు

కొండమల్లేపల్లి: వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మాల్: గొడకొండ్ల వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు

దామరచర్ల: ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

అడవిదేవులపల్లి : కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలగిరి(సాగర్): భగవద్గీత శ్లోకాల చదువుతున్న చిన్నారులు

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బారులుతీరిన వాహనాలు

పల్లెబాటన నగరవాసులు చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ

చౌటుప్పల్, డిసెంబర్23 : మూడ్రోజులపాటు వరుస సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు పల్లెబాట పట్టారు. ఆదివారం సాధారణ సెలవు, సోమవారం క్రిస్మస్, మంగళవారం బాక్సింగ్ డే ఉండటంతో సొంతూళ్లకు పయనమైన వాహనదారులతో 69వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. దాంతో శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని స్థానిక బస్‌స్టాండ్, తంగెడపల్లి, వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలతో రోడ్డు కిక్కిరిసింది. స్థానిక వాహనదారులు, ప్రజలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సర్వీస్ రోడ్డు వెంట కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

విద్యార్థులు వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
- అలరించిన జిల్లా స్థాయి యువజనోత్సవం

యువజనోత్సవ పోటీల్లో నృత్యం చేస్తున్న యువతులు

రామగిరి, డిసెంబర్ 23 : ప్రతిఒక్కరూ విద్యతో పాటు వివిధ కళా రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని, అందుకు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని కేపీఎం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన 'జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2023'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులోని ప్రతిభ వెలికితీతకు ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. డీఎస్‌డీఓ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఆయా అంశాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జనవరి 6, 2024లో రాష్ట్ర స్థాయిలో జరిగే యువజనోత్సవాలకు పంపిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు, యువత జానపద నృత్యం గ్రూప్, జానపద నృత్యం సోలో, జానపద గానం గ్రూప్, సోలో అంశాల్లో నిర్వహించిన పోటీల్లో చేసిన అంశాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

విజేతలు వీరే..

	ప్రథమ	ద్వితీయం	తృతీయం
జానపద నృతం(గ్రూప్)	అనూష గ్రూప్	హాసినీ గ్రూప్	సద్గుణ గ్రూప్
జానపద నృత్యం(సోలో)	వేద శ్రీ	ఉజ్వల	హర్షిత
జానపద గానం (గ్రూప్)	పరమేశ్ గ్రూప్	శృతి గ్రూప్	-----
జానపద గానం (సోలో)	నాగ జ్యోతి	శ్రేష్ట చంద్ర	భువనేశ్వరి

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 23 :క్రిస్మస్ పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి ఒకరికొరు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొని ప్రభుత్వం అందించిన గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని శకుంతల ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు నూతన దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవుల మధ్య కేక్ కట్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

సంస్థాన్‌నారాయణపురం : పుట్టపాక చర్చిలో క్రిస్మస్ కానుకలు అందిస్తున్న ఎంపీపీ గుత్తా ఉమాదేవి

నవ సమాజ స్థాపనలో తల్లిదండ్రుల పాత్ర గణనీయం

మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, డిసెంబర్23 : నవ సమాజ స్థాపనలో తల్లి దండ్రుల పాత్ర ఘనీయమైనదని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. ట్రీనీటి స్కూల్ ఆధ్వర్యంలో పట్టణకేంద్రంలోని జయశ్రీ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన మాతృ, పితృ పాదపూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను ప్రేమానురాగాలతో చూసుకోవాలన్నారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు విద్యార్థులు తమ తల్లి దండ్రుల పాదాలు కడిగారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రెడ్డి, పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, డైరెక్టర్ ఉజ్జిని మంజుల, వార్డు కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు యనాల ప్రభాకర్‌రెడ్డి, బొడిగె బాలకృష్ణాగౌడ్, బొబ్బిళ్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.